# మలుపు

- వాలి హిరణ్మయీదేవి

"హాయ్ సౌమ్యా! నువ్వా! మోస్ట్ వెల్‌కమ్" ఆశ్చర్యానందాలతో అరుస్తూ సౌమ్యకి దారిచ్చాడు లోపలికి రావడానికి శశాంక.

"నీకు తెలుసుగా ఈ స్ట్రీట్‌లోనే పావని ఉందని. దాని దగ్గరికి వస్తే లాక్ చేసి వుంది."

"కాబట్టి తప్పనిసరై మాత్రం ఇక్కడికి వచ్చావన్నమాట" కినుకుగా అన్నాడు శశాంక ఆమె చెప్పేది పూర్తిగా వినకుండానే.

"అరె... అలా ఉడుక్కుంటావేంటి. దాని దగ్గర నోట్స్ రాసుకోడం కాగానే నీ దగ్గరికి వద్దామని కూడా అనుకున్నాను" అంది సౌమ్య నెమ్మదిగా.

దాంతో కొంత సాటిస్‌ఫై అయ్యాడు శశాంక.

వాళ్లిద్దరి తల్లులూ ఫ్రెండ్స్. తరచూ కలిసేది క్లబ్స్‌లోనే. అక్కడ సందడంతా వారిద్దరిదే. ఆస్తీ అంత స్థుల్లో సమానులే కాబట్టి స్నేహాన్ని బంధుత్వంగా మార్చుకోవాలన్న తలంపుతో శశాంక-సౌమ్యల పెళ్లి తలపెట్టారు. ఎగ్జామ్స్ కాగానే వారిద్దరి ఎంగేజ్‌మెంట్ చేయాలని ప్లాన్ చేసుకున్నారు. దాంతో వారిద్దర్నీ కాబోయే భార్యాభర్తలుగా అందరూ ట్రీట్ చేస్తున్నారు. సౌమ్యకి శశాంకపట్ల ఎలాంటి అభిప్రాయం అంతవరకూ ఏర్పడలేదు. కానీ ఏ వంకా పెట్టడానికి వీల్లేకుండా ఉండడంతో తల్లి మాటలకు ఎదురు చెప్పలేదు. కానీ మాటిమాటికీ శశాంక రావడం తన చదువుకి ఇబ్బంది కలిగించడం ఇష్టంలేక సాధ్యమైనంత వరకూ అతడిని తప్పించుకుంటూ ఉండటం అలవాటు చేసుకుంది. శశాంక మాట్లాడే మాటలు ఆమెకి నచ్చక ఏ మూలో అతనిపట్ల కొంత అసంతృప్తి.

'నాకంటూ వ్యక్తిత్వం ఉంది అనేదానివిగా. కాబోయే భర్తని నీకై నీవు సెలెక్ట్ చేసుకోకుండా అమ్మ కూచిలా మీ పేరెంట్స్ చూసిన మాచ్‌నే ఎందుకు ఒప్పుకున్నా'వని దగ్గరి ఫ్రెండ్స్ నిలదీస్తే జవాబులేదు. అది ఆమెకి కించిత్తు బాధ. స్వయంగా ఎన్నుకున్న వరుడు కాదని చెప్పడంతో నిజమేనని పించింది. ఆరడుగుల అందగాడు, చదువులో దిట్ట, ఆస్తిపాస్తులున్నవాడు తన స్వంతం అవుతుంటే ఇంకేం కావాలి అని సరిపెట్టుకుంది.

"హాయ్ సౌమ్యా! ఇదేనా రావడం? అలా హాల్లో కూర్చున్నావేం? ఏయ్ శశాంక్ నీ రూమ్‌లోకి తీసుకెళ్ళు" అన్న గిరి మాటలతో ఒకర్నొకరు చూసుకుంటున్న సౌమ్యా శశాంక్‌లు ఈ లోకంలోకి వచ్చారు.

"పద సౌమ్య!" అంటూ దారి తీసిన శశాంకని అనుసరించిందామె.

"నేను స్నానం చేసి వస్తాను. కూర్చో" అంటూ బాత్రూమ్‌లో దూరాడు శశాంక.

హైసౌండ్‌లో వున్న టేప్‌ని కాస్త తగ్గించి మంచం మీద చెల్లాచెదురుగా పడివున్న బుక్స్‌ని సర్దింది సౌమ్య. శుభ్రతంటే ఆమెకి ప్రాణం. అన్నిటినీ ఓ క్రమంలో పెట్టిందేమో రూమ్ ఇట్టే నీట్‌గా మారింది. గోడమీది సినీ స్టార్స్ బట్టల కరువుతో దర్శనమిస్తుంటే చిరాగ్గా తల తిప్పుకుంది.

ఇంతలో రివ్వుమంటూ వచ్చింది ప్రియాంక "శశాంకా" అంటూ.

"వాట్ వండర్. నువ్వెప్పుడొచ్చావ్ సౌమ్యా! వీడేడి బాత్రూమ్‌లో దూరాడా? అయితే రెండుగంటలవరకు బైటకు రాడు. ఎలా? నేను బ్యూటీపార్లర్‌కి వెడుతున్నా. డబ్బులు తీసుకుంటున్నానని చెప్పు" అంటూ టేబుల్ మీదున్న పర్సులోంచి నాలుగైదు వందల నోట్లు లాగి "బై... నా కోసం రాహుల్ ఎదురు చూస్తుంటాడు" అంటూ వచ్చినంత హడావుడిగా వెళ్లిపోయింది.

డ్రెస్సుల్ని మార్చినంత తేలిగ్గా తన బాయ్‌ఫ్రెండ్స్‌ని మారుస్తూ ఉండే ప్రియాంక సౌమ్యకి అర్థం కాని పజిల్.

పిల్లలకి అంత స్వేచ్ఛనిచ్చే ఆ తల్లిదండ్రులన్నా ఆమెకి ఆశ్చర్యమే. తన పేరెంట్స్ తనకి స్వేచ్ఛనిచ్చినట్టే ఇస్తూ ఎక్కడికక్కడ కట్టడి చేస్తుంటారు మరి. ప్రతి కదలిక గురించి తెలుసుకుంటూనే వుంటారు.

కానీ ఫ్రెండ్స్‌తో తిరగడం విషయంలో, తిండి, కోరుకున్న డ్రెస్‌ల విషయంలో మాత్రం ఎలాంటి నిబంధనలూ పెట్టరు.

"ఓహ్! ఇంత తొందరగా నా రూమ్‌ని సర్దేశావా! కానీ నాకిలా ఉంటే ఎలాగో వుంటుంది" అన్నాడు తల తుడుచుకుంటున్న టవల్‌ని కుర్చీలోకి విసురుతూ. అర్ధనగ్నంగా అంత దగ్గరగా వున్న శశాంకని చూడలేక తలొంచుకుంది సౌమ్య.

"ఆ క్రీమ్‌కలర్ డ్రెస్ తీసియ్యవూ" అన్నాడు శశాంక రిక్వెస్టింగ్గా.

బీరువా తెరిచి అటు తిరిగి వున్న సౌమ్యని వెనుక పాటుగా వెళ్లి వాటేసుకున్నాడు శశాంక "వాట్ బ్యూటిఫుల్ అండ్ స్టన్నింగ్ స్ట్రెక్చర్" అంటూ.

తెల్లబోయింది సౌమ్య దడదడా కొట్టుకుంటున్న గుండెలతో. ఒక్కసారిగా అతడిని వదిలించుకుంది.

"నాకిలాంటివి నచ్చవ్" అంది కాస్త కోపంగా.

హర్టయినట్టు చూసాడు శశాంక.

"ఏంటి సౌమ్యా! మనం ఎలాగూ కాబోయే భార్యాభర్తలమేగా?" అన్నాడామెని మళ్ళీ కౌగలించుకోబోతూ.

"ఇంకా అవలేదుగా" కించిత్తు అసహనంతో అంది సౌమ్య.

"ఏం కామని అపనమ్మకమా?" రెట్టిస్తూ అన్నాడు శశాంక.

"అదేంకాదు. మనకంటూ ఉన్న కట్టుబాట్లని దాటడం నాకిష్టం ఉండదు."

"నువ్వీకాలంలో పుట్టాల్సిందానివి కాదు. మా రవి ఉడ్‌బి ఎంత ఫాస్టో తెలుసా? అప్పుడే వాళ్ల డేటింగ్ కూడా అయిపోయింది తెల్సా" కన్ను గీటుతూ అన్నాడు శశాంక.

"అది వాళ్లిద్దరి సమస్య. నాకనవసరం. అయినా వేరేవాళ్లతో మనల్ని పోల్చుకోవడం ఏమిటి?" అంది అతనికి దూరంగా వున్న కుర్చీలో కూర్చుంటూ.

ఇంకేం మాట్లాడలేక ఆమె తీసిచ్చిన డ్రెస్ అందుకున్నాడు. సౌమ్య లేచి బాల్కనీలోకి వెళ్లిపోయి అతను పూర్తిగా డ్రెస్సయ్యాక వచ్చింది.

"ప్రియాంక వచ్చి వెళ్లింది" చెప్పింది సౌమ్య.

"బాప్‌రే. ఎంత ఊడ్చేసిందో" అంటూ కంగారుగా పర్సులోని నోట్లని అతడు లెక్కపెట్టుకుంటుంటే నవ్వింది సౌమ్య.

నవ్వితే మరింత ముగ్ధ మనోహరంగా మారిన ఆమె వంక రెప్పార్చక చూసాడు శశాంక. అంతటి అందం తన సొంతం అనుకుంటే అది అతనికి ఎంతో గర్వంగా వుంటుంది.

"అవునూ. నువ్వెప్పుడు బ్యూటీపార్లర్‌కి వెళ్లవేం?"



అనడిగాడు శశాంక.

"నాకిష్టం ఉండదు" మెల్లగా అంది సౌమ్య.

"ఎత్తయిన నీ కనుబొమల్ని ట్రిమ్ చేస్తే మరింత బావుంటావ్."

"ఇంట్లో ఎవరూ కన్పించరేం" అతడు తెచ్చిన టాపిక్‌ని మార్చే ప్రయత్నంగా అడిగింది సౌమ్య.

"ఏం.. ఎవరూ లేరని భయమా?" కొంటెగా అడిగాడు శశాంక.

"ఎందుకు భయం? నువ్వేమీ క్రూర మృగానివి కాదుగా" కాస్త చిరాగ్గా అంది సౌమ్య.

'అయ్యబాబోయ్... ఈవిడగారితో ఏం మాట్లాడితే ఏం తంటానో' అనుకుంటూ "హోం ఫర్ ఏజ్డ్‌లో వున్న మా గ్రాండ్ పేరెంట్స్‌ని చూడ్డానికి వెళ్లారు. వాళ్ళ మారేజ్ డే అట ఇవాళ. విషెస్ చెప్పడానికి వెళ్లారు" అన్నాడు చాలా మామూలుగా శశాంక.

"ఏంటీ? వాళ్లక్కడ మీరిక్కడా ఉంటారా?" ఆవేదనగా అందామె.

"వాళ్లిక్కడున్నా చాలా బోర్ ఫీల్ అవుతారు ఇక్కడ మాట్లాడే వాళ్ళు లేక" అన్నాడతను కాజువల్‌గా.

సౌమ్యకి ఊపిరాడనట్లుగా అన్పించింది. పెరుగుతున్న ఈ నాగరికత చాప కింది నీరులా మన తరతరాల సంస్కృతిని, ప్రేమాభిమానాల్ని కబళించేస్తోంది అనుకుంది. ఆ తరువాత ఇక అక్కడ కూర్చోలేకపోయింది.

"మనం వెళదామా?" అంది లేచి నిలబడుతూ.

"అప్పుడేనా?" నిరాశగా అంటూ "ఇవాళ కాలేజీ ఎగ్గొట్టేయ్. అలా సరదాగా నా బైక్ మీద గండిపేట వరకూ వెళ్లొద్దాం" అన్నాడామె వంక చూస్తూ.

"ఎందుకూ?" ఆశ్చర్యంగా అంది సౌమ్య.






## దొండపండు సంగీత

"రౌండ్‌గా, గుండ్రంగా, అరేబియన్ గుర్రంలా ఉన్నావని ఇండస్ట్రీలో అందరూ అంటున్నారు. బాగా తిని, హాయిగా పడుకుంటాను. అందుకే లావుగా, బొద్దుగా, ముద్దుగా ఉంటాను. ఈ వయసులో నోరు కట్టేసుకుని ఎలా ఉంటామండీ. నా గ్లామర్ రహస్యం మాత్రం ఏమిటంటే రోజుకి ఆరులీటర్ల నీళ్ళు తాగుతాను" అంటోంది దొండపండులాంటి సంగీత. (సంగీతా! నీళ్ళ సమస్య అని నీకు తెలీదా!)

– శశి




"ఇక్కడ నీకు భయంగా ఉన్నట్టుంది. బైటకెళితే నైనా ఫ్రీగా ఉంటావని. ముఖ్యంగా నన్ను వాటేసుకుని కూర్చుంటావని" ఎత్తయిన ఆమె వక్షభాగం వంక కాంక్షగా చూస్తూ అన్నాడతను.

ఆ చూపులు ఆమెకి చీదరతోపాటూ కలవరాన్ని కలిగించాయి.

"వద్దు... నాకిష్టంలేదు" అంది సౌమ్య.

"ఎప్పుడూ నీ ఇష్టాలే నెగ్గాలా? అయినా నేనంటే ఇష్టం కలిగేలా చేస్తానుండు" అంటూ ఆమెని బెడ్ మీదకు తోసి మీద వాలి పెదవుల మీద ముద్దు పెట్టుకోబోయాడు.

అతడి వెచ్చటి ఊపిరి మెడ దగ్గర కాల్చేస్తుంటే అతడి చేతులు కాంక్షగా తన వంటినెక్కడెక్కడో తడుముతూ ఉంటే జుగుప్సగా తోచింది సౌమ్యకి. ఒక్క ఉదుటున అతడిని కాలితో తన్ని విదిలించుకుని బట్టలు సవరించుకుంటూ బైటకి వచ్చేసింది.

అవమానంతో ఎర్రబడిపోయింది శశాంక మొహం.

***

తదేకదీక్షతో తన చేతులకు గోరింటాకు పెడుతున్న సౌమ్య వంక చూస్తూ 'సౌమ్య అనుకున్నది అనుకున్నట్లు జరిగితే ఈ పాటికి నీ పెళ్లయిపోయి ఉండేది. శశాంక నీమీద ఏవేవో చెప్పి పెళ్లి కాన్సిల్ చేశాడని విన్న దగ్గర్నుండి నాకెంత బాధ కలిగిందో తెలుసా" అంది పావని. తెల్లారితే ఆమె పెళ్లి.

"జరిగేదంతా మంచికని అనుకోవడమే మనిషి పని అన్నాడు మహాకవి మరచిపోయావా?" అంది సౌమ్య చిన్నగా నవ్వుతూ.

"అబ్బ అంత తాపీగా ఎలా ఉండగలుగుతున్నావే బాబూ... అనుకున్న పెళ్లి ఆగిపోవడం నీకు బాధగా లేదూ" అంది బాధగా పావని.

"ఏమాత్రంలేదు. పిసరంతయినా లేదు మా నాన్నగారి బిజినెస్ దెబ్బ తినడంతో అంతవరకూ శశాంకకి నచ్చచెప్పిన అతని తల్లిదండ్రులే ఇక మాట్లాడలేదు. దాంతోనే తెలిసిపోయింది వాళ్ళంతా ఎంత డబ్బు మనుషులన్నది. నేను లక్కీఫెలోని కాబట్టే ఈ పెళ్లి తప్పిపోయిందనుకుంటున్నాను. ఐనా నాకెందుకో శశాంకపట్లా, వాళ్ళ ఫామిలీ పట్లా అంతర్లీనంగా తెలీని అయిష్టత. దేవుడు నా ఇష్టాన్ని తెలుసుకునే తప్పించాడంతే" తను పెట్టిన గోరింటాకుని వివిధ కోణాల్నుండి చూస్తూ అంది సౌమ్య.

"ఆ... పావనీ! నిన్న తెచ్చిన కొబ్బరి బోండాలు ఇక్కడున్నాయా?" అంటూ వచ్చిన గౌతమ్ అక్కడున్న సౌమ్యని చూస్తూ ఆగిపోయాడు

'చక్కనమ్మ చిక్కినా అందమే' అన్న సామెతలో ఇంత నిజం ఉందా అన్న ఆశ్చర్యంతో. ఎలాగో గొంతు పెగుల్చుకుని "బాగున్నారా" అనడిగాడు

అతని చూపుల్లోని ఆప్యాయతకి కళ్ళు దించుకుంది సౌమ్య. ఏమీ మాట్లాడకుండా ఉన్న ఆమె భుజం తడుతూ "నిన్నేనే మా అన్నయ్య అడుగుతున్నది" అంది పావని.

"ఆ... బాగున్నాను" అంది గబగబా.

అతడ్ని పావని వాళ్లింట్లో చాలాసార్లే చూసింది. కానీ ఎప్పుడూ మాట్లాడలేదు. కానీ గౌతమ్ మాత్రం ఆమెని వీలైనంతవరకూ చాటుగా ,చూసేవాడు. ఆమె అన్నా ఆమె వ్యక్తిత్వమన్నా ఆరాధన. కానీ శశాంక కాబోయే భార్య సౌమ్య అంటూ మనసుకి నచ్చచెప్పుకున్నాడు. అతని మూగ ఆరాధన తెలిసింది పావనికొక్కదానికే.

కానీ ఏమీ చేయలేక తెలీనట్లుండిపోయింది.

"ఇక నేను వెడతానే. నాన్న ఎదురు చూస్తూ వుంటారు" అంది సౌమ్య.

"రేపు తొందరగా వచ్చేస్తావుగా. అసలు నువ్వెళ్లకుండా ఇక్కడే ఉంటే బావుండేది. తెల్లవారుఝాము ముహూర్తమేకదా" అంది పావని.

"నిజమే. కానీ తెలుసుగా నాన్న ఒంటరిగా ఉంటారు. పొద్దుటే నాన్నా నేనూ వస్తాం" అంది లేచి నిల్చుంటూ సౌమ్య.

"ఇంత చీకట్లో ఒక్కదానివి ఎలా వెళతావ్?" అంటూ గౌతమ్ వైపు తిరిగి "అన్నయ్యా! కాస్త సౌమ్యని దిగబెట్టిరా" అంది పావని.

"పదండి" అని గౌతమ్ అనేసరికి తెల్లబోయింది సౌమ్య.

"ఆహా.. వద్దు. దగ్గరేకదా. నడిచి వెళ్లిపోతాను" అంది గబగబా.

"పోనీ బైక్‌మీద వద్దు. నడిచే తోడొస్తాను. చాలా పొద్దుపోయిందికదా. పదండి" అన్నాడు మరో మాటకి తావీయకుండా.

"సరే"నంటూ తప్పనిసరై అతడిని అనుసరించింది సౌమ్య.

***

స్నేహమేకాక దగ్గరి చుట్టరికం కూడా ఉండడంతో సౌమ్యకీ, పావనికి వాళ్లింట్లో పదిరోజులు ఉండక తప్పలేదు. అలాగే అన్ని పనులనీ తనమీదే వేసుకుని పని చేసే గౌతమ్‌తో అదో ఇదో మాట్లాడకా తప్పలేదు.

పెళ్లయి పావని వెళ్లిపోయింది. ఎప్పుడయినా గౌతమ్ దారిలో కనిపించి విష్ చేసినా చిరునవ్వు నవ్వి తలొంచుకుని వెళ్లిపోయే సౌమ్యపట్ల మరింత ఇష్టం పెరగసాగింది గౌతమ్‌లో. శశాంకతో ఆమె పెళ్లి తప్పిపోయిన దగ్గర్నుండీ మళ్లీ అతనిలో ఆశలు చివురు తొడగసాగాయి. కానీ అటు తల్లిని

కోల్పోయి ఇటు పేషెంట్‌గా మారిన తండ్రి బాధ్యతలతో సతమతమయ్యే ఆమెతో తన ప్రేమ సంగతి ప్రస్తావించడం ఎలాగో తెలీక తికమకపడసాగాడు గౌతమ్.

★★★

దబదబమని తలుపు చప్పుడవుతుంటే 'అర్ధరాత్రి మద్దెల దరువులా ఇదేంటి?' అనుకుంటూ తలుపు తెరిచిన గౌతమ్ నిర్ఘాంతపోయాడు.

ఎర్రబడ్డ కళ్లతో, రేగిన జుట్టుతో, చెదరిన పైటతో, నుదుటి నిండా స్వేదం అలుముకున్న సౌమ్య కనిపించింది అతనికి.

"ఏం జరిగింది సౌమ్యా!" కంగారుగా అడిగాడు గౌతమ్.

"నాన్నకి... నాన్నకి హార్ట్ ఎటాక్" ఎగిసిపడ్తోన్న గుండెలతో చెప్పింది సౌమ్య.

ఆమె మాటింకా కాకముందే బైక్ తీసాడు గౌతమ్. దారిలోనే ఆటో మాట్లాడి తన బైక్‌ని వాళ్లింట్లోనే వదిలి సౌమ్య తండ్రి రాఘవయ్యని ఆటోలో హాస్పిటల్‌కు తీసుకెళ్లడం, వాళ్లు అడ్మిట్ చేసుకుని ట్రీట్‌మెంట్ ఇవ్వడం జరిగాయి.

★★★

బెడ్‌మీద బలహీనంగా ఊపిరి పీలుస్తున్న తండ్రిని చూస్తుంటే సౌమ్యకి దుఃఖం ఆగడంలేదు.

తను వెళ్లిన టైమ్‌కి గౌతం లేకున్నా, రావడం ఆలస్యమైనా, ఆటో దొరక్కపోయినా తన తండ్రి తనకి దక్కేవాడా? అని పదేపదే అనుకుంటుందామె మనసు.

"నువ్విలా ఏడుస్తూ కూర్చుంటావని దేవుడు చల్లగా చూసి ఆయన మనకి దక్కేరు. ఊరుకో. ఏడవకు" అన్నాడు గౌతం.

జరిగిన సంఘటనతో మనసులో అంతకుముందే ఏర్పడ్డ అనురాగంతో తనామెని ఎంతో చనువుగా, ఏకవచనంతో సంబోధిస్తున్న సంగతే గుర్తుకురావడం లేదతనికి.

"మీకు... మీకు ఎలా కృతజ్ఞతలు చెప్పాలో..." సౌమ్య మాటలకు అడ్డొస్తూ-

"ఛ...అవేం మాటలు. మనలో మనకీ మాటలెందుకు?" అన్నాడు చిరునవ్వుతో గౌతం.

నల్లగా ఉన్నా కళగా ఉండే గౌతమ్ నవ్వితే చాలా బావుంటాడు అనుకున్నది సౌమ్య మొదటిసారిగా.

అతడు తన కుటుంబంపట్ల చూపిన శ్రద్ధాసక్తులు, తమపట్ల కూడా చూపించడం ఆమె మనసుకి తెలియని సంతృప్తిని కలిగించాయి. అతనిపట్ల ఉన్న గౌరవం అభిమానంగా మారడం మొదలుపెట్టింది. రోజులు గడుస్తున్నాయి.

క్రమక్రమంగా కోలుకోసాగాడు రాఘవయ్య.

గౌతమ్ తమపట్ల చూపించే శ్రద్ధ, మగవాళ్ళని ఆమడదూరంలో ఉంచే సౌమ్య అతనితో మర్యాదపూర్వకంగా ప్రవర్తించడం రాఘవయ్యలో ఆలోచనలు రేకెత్తించాయి. అంతే... గౌతమ్ రాగానే పెళ్లి ప్రస్తావన తెచ్చాడు. ఫలితంగా నెల తిరక్కుండానే భార్యాభర్తలయ్యారు గౌతమ్ సౌమ్యలు.

★★★

"ఈ తెల్లచీరలో నువ్వెలా ఉన్నావో తెలుసా. నాకు శాంతిని ప్రసాదించడానికి వచ్చిన దేవదూతలా ఉన్నావ్" అన్నాడు గౌతం.

అతని పశ్నకు సవ్వొచ్చిందీ సౌమ్యకి.

"సౌమ్యా! ఎక్కడో చదివాను."

"నిజమైన భార్య నిన్ను నవ్విస్తుంది. పాడిస్తుంది, ఓదారుస్తుంది. గుండె గది ఒంటరితనాన్ని తన జ్ఞాపకాలలో పోగొడుతుంది. వర్షం చినుకుల శబ్దాన్ని కూడా కలసి వింటుంది. ఇస్తుంది. తీసుకుంటుంది. అన్నింటికంటే ముఖ్యంగా బతకడం ఎలాగో నేర్పుతుంది. అలాంటి మంచి భార్యగా నువ్వుంటే నా అంతటి అదృష్టవంతుడు మరొకడుండడు."

ఆ మాటలకు కళ్ళు విప్పార్చుకుచూసింది సౌమ్య.


"నేను జఘురాలినంటూ శశాంక వదిలించుకున్న నన్ను మీరు భార్యగా చేసుకోవడం నా అదృష్టం. ముఖ్యంగా నాన్నకి ఇప్పుడున్న నిశ్చింత, మీరు పెట్టిన భిక్ష. ఇందుకు నేనెలా కృతజ్ఞతలు..."

"సౌమ్యా! వద్దు. మనమధ్య ఈ కృతజ్ఞతలు, క్షమాపణలు వద్దు. నీకు నేనూ, నాకు నువ్వూ. అంతే" అన్నాడామెని మృదువుగా హత్తుకుంటూ.

ఆ కౌగిలిలో ఏం మహిమ వుందోగానీ సౌమ్యలో తెలీని నిశ్చింత, ఒళ్లంతా పులకరింత. సుతిమెత్తగా అతడు తనని స్పర్శిస్తూ ఉంటే భల్లూకపు పట్టుకి ఇప్పటి కౌగిలింతకు వున్న తేడా తెలిసి వచ్చింది. ఆ వెంటనే తన దేహంలో కలుగుతున్న చిరు ప్రకంపనలు ఉధృతమవుతుంటే నిలువలేక అతనిమీదకు వాలిపోయింది. ఇద్దరిలోనూ ఒకటే భావం. అది ఒకరికోసం మరొకరన్నది. ఇన్నాళ్ళూ ఎలా విడిగా ఉండగలిగామన్న ఆశ్చర్యం!

అమృతభాండాన్ని జుర్రుకునే ప్రయత్నంలో గౌతమ్ అతనికి విజయం సిద్ధించేందుకు తనవంతు సహకారాన్ని అందిస్తున్న సౌమ్య. విజేతలైన ఇద్దరి అంతరంగాల్లోనూ అంతులేని సంతృప్తి. తన జీవితాన్ని ఇంత అద్భుతంగా మలుపు తిప్పిన విధాతకి మనసులోనే నీరాజనాలర్పించింది సౌమ్య. నిజమైన రసాస్వాదన తెలిసిన ఆమెలోని జడత్వం ఎప్పుడో ఆవిరైపోయింది.

★



## వృద్ధుడు

## మెట్లెక్కిన వైనం

నలభయ్యేళ్ళు దాటితేచాలు మెట్లెక్కాలంటే కుయ్యో, మొర్రో అంటాం. మోకాళ్ళు పట్టుకుంటాం. లిఫ్ట్ లేకపోతే నడవదు. అలాంటిది బిల్డింగ్‌ని అవలీలగా ఎక్కేసాడు చికోపిల్ అనే వృద్ధుడు. ఇతని వయసు అరవై ఎనిమిది సంవత్సరాలు. అయితే ప్రతియేటా మెట్లెక్కడం ఓ పోటీగా జరిగే ఈ ప్రదేశంలో ఈసారి నూట పదహారుమంది పాల్గొన్నారు. తొమ్మిది నిముషాల్లో ఈ అరవై అంతస్థుల మెట్లూ అవలీలగా ఎక్కేసినా, వయసుని దృష్టిలో పెట్టుకున్న యాజమాన్యం మాత్రం చికోపిల్‌కే మొదటి బహుమతి అనౌన్స్ చేసారు. ఎందుకంటే ముసలి వయసులో కూడా కాళ్ళ నొప్పులనకుండా చకచకా ఎక్కేసిన అతని ధైర్యానికిమెచ్చి. అయితే నిరంతరం ఈ మెట్లు ఎక్కడం ప్రాక్టీసు చేసేవాడట చికోపిల్. అదీ విషయం. మరి మీరూ ట్రై చేయరాదూ!

– శశి

